

మూషికాలతో ముప్పు


మూషికాలు అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో ఈ సమస్య మరీ తీవ్రంగా మారింది. - 10లో



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి ఆలయం వద్ద వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఎం.శివ, సత్యవతి దంపతులు (బొమ్మూరు) రూ.50 వేల విరాళం అందించారు.

97 వేల క్యూసెక్కుల జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి సోమవారం సాయంత్రం 97,825 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.80 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 14,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

పీజీఆర్ఎస్‌లో 141 అర్జీల స్వీకరణ



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఇతర అధికారులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయి అధికారులు నిబద్ధతతో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలిసి ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి వివిధ మండలాలకు చెందిన వారు సమర్పించిన అర్జీలను స్వీకరించి, రెవెన్యూ, మండల స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వాటిపై సమీక్షించారు. ప్రజల సమస్యల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, తమ పరిధిలో పరిష్కారమయ్యే వాటిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూకు సంబంధించి 58, పంచాయతీరాజ్ 25, గృహాలకు 16, పౌర సరఫరాల శాఖకు 8, ఆర్‌డబ్ల్యూఎస్ 7, ఇతర శాఖలకు చెందిన 27 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలపై దృష్టి

– డీఈఓ వాసుదేవరావు



రాజానగరం: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలను సాధించే దిశగా కసరత్తు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. దివాన్‌చెరువులో సోమవారం ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, విద్యా సంవత్సర క్యాలెండర్ ప్రకారం సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి, రివిజన్ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. బోధనా అవసరాలకు అనుగుణంగా అన్ని పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులను కూడా కేటాయించామన్నారు. ఇదే సమయంలో పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన చేసే క్రమంలో ఉపాధ్యాయునికి, విద్యార్థికి 5–6 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలని సూచించామన్నారు. అలాగే విద్యార్థినులతో ఉపాధ్యాయులెవ్వరూ వ్యక్తిగత సంభాషణలు చేయరాదని స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు.

రూ.7 లక్షలే చెల్లింపు

సీతానగరం: వెదుళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో గల్లంతైన నగదులో చెల్లించాల్సిన రూ.32 లక్షలకు గాను సోమవారం రూ.7 లక్షలు మాత్రమే చెల్లించారు. ఈ నెల 2న 'సాక్షి'లో 'పీఏసీఎస్‌లో రూ.56 లక్షలు గల్లంతు' శీర్షికన కథనం వెలువడింది. నగదు గల్లంతుకు బాధ్యులైన పీఏసీఎస్ సీఈఓ సురేంద్ర, గుమస్తా పోశియ్య, ఎరువుల సేల్స్‌మన్ భారతిపై.. నగదు చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీసీఓ శ్రీరాముల నాయుడు, డీసీఏఓ, ఇన్‌చార్జి డీఆర్ జనార్దనరెడ్డి ఈ నెల 4న సంబంధిత ఆడిటర్, అఫీషియల్ పర్సన్‌ఇన్‌చార్జి కృష్ణమోహన్‌కు నిర్దేశించారు. శనివారం నగదు సర్దుబాటు కాకపోవడంతో సోమవారం డీసీసీబీలో రూ.7 లక్షలు జమ చేశారు. ఇంకా రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉంది. నగదు గల్లంతుకు బాధ్యులైన ముగ్గురు పూర్తి నగదు చెల్లించడానికి మరో రెండు రోజులు గడువు అడిగినట్టు సమాచారం. ఇంకా రూ.25 లక్షలు చెల్లించాల్సి ఉందని, వీరిపై తగిన చర్యలు తీసుకుంటామని అఫీషియల్ పర్సన్‌ఇన్‌చార్జి కృష్ణమోహన్ తెలిపారు.





నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పురోగతిలో ఉన్న గృహ నిర్మాణాలు

సొంతిల్లు కలేనా!?

- జగనన్న ఇళ్ల నిర్మాణాలపై కూటమి ప్రభుత్వం ఆంక్షలు
- మార్చిలోపు పూర్తి చేసుకోవాలని అల్టిమేటం
- శ్లాబ్ దశలో ఉన్నవి నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశం
- గృహ నిర్మాణాలపై దృష్టి సారించని ప్రభుత్వ యంత్రాంగం
- మన ఇల్లు.. మన గౌరవం పేరిట అవగాహన సదస్సులతో కాలయాపన
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

పేదల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేసే దిశగా అడుగులు వేస్తోందా..? గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఉన్న అక్కసుతో నిరుపేదలకు అన్యాయం చేస్తోందా..? పక్కా ఇళ్లకు వచ్చే ఏడాది మార్చి తర్వాత కేంద్రం నిధులు నిలిపివేస్తుందని, అప్పటిలోగా పూర్తి చేసుకోవాలనడం వెనుక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్న లబ్ధిదారుల్లో ఉత్పన్నమవుతోంది.

సాక్షి, రాజమహేంద్రవరం: లక్ష్యాలు నిర్దేశించిన ప్రభుత్వం.. సాధనకు అడుగులు వేయడం లేదు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాల్సి ఉన్నా.. 'మన ఇల్లు.. మన గౌరవం' పేరుతో అవగాహన సదస్సులు పెడుతూ కాలయాపన చేస్తోందని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

వంద రోజుల పాలనలో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో గృహ నిర్మాణాలపై అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటుతున్నా.. కేవలం 855 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. అది కూడా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన పనులు కావడం గమనార్హం. దేవరపల్లిలో 114 ఇళ్లు, నల్లజర్లలో 99, రాజమహేంద్రవరం అర్బన్‌లో 111, కొవ్వూరులో 57, గోపాలపురం 46, రంగంపేటలో 38 ఇళ్లు పూర్తయినట్లు తెలిసింది. మిగిలిన మండలాల్లో పురోగతి అంతంత మాత్రంగానే ఉంది.

100 రోజులు.. 4,875 గృహాలు

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించిన అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. వంద రోజుల్లో పూర్తి చేయాల్సిన నిర్మాణాలపై అధికార యంత్రాంగం ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించింది. హౌసింగ్, ప్రత్యేక అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి, నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేయాలి. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. వంద రోజుల ప్రణాళికలో 4,875 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. వీటిని డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని భావించారు. ఇప్పటి వరకు 331 మాత్రమే పూర్తి చేసి 7 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఇంకా 4,544 ఇళ్లు పూర్తి చేయాల్సి ఉంది. కానీ అధికార యంత్రాంగం మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డిసెంబర్ నెలాఖరుకు ఇవి పూర్తి చేయడం అసాధ్యమన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రభుత్వం, అధికార యంత్రాంగం ప్రచారాలు, మొక్కుబడి సమావేశాలకే పరిమితం కావడంతో లక్ష్యాలు పడకేశాయి.

డెడ్‌లైన్ మార్చి..

పీఎంఏవై కింద పేదలు నిర్మించుకుంటున్న గృహాలకు కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందుతోంది. ప్రస్తుతం నిర్మాణంలోని ఇళ్లకు వచ్చే ఏడాది మార్చి తర్వాత కేంద్రం నిధులు ఇవ్వదు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి పంపిన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. నిధులు సద్వినియోగం చేసుకునేలా హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల్లో అవగాహన కల్పించడం లేదు. దీంతో అవగాహన లేక ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. అసంపూర్తి నిర్మాణాలను సంపూర్ణం చేసే దిశగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది కేవలం ఇంటి స్థాయి నమోదుకు పరిమితమవుతున్నారే మినహా, క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్ధిదారులకు చేదోడుగా ఉండడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే అప్పులు చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పుడేమో డెడ్‌లైన్ విధించడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. సొంత స్థలాల్లో శ్లాబ్ నెలాఖరులోగా.. పునాది, గోడల స్థాయిలో ఉన్న వాటిని వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. పీఎంఏవై 1.0లో మంజూరైన గృహాలను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయకపోతే.. పీఎంఏవై 2.0లో మంజూరయ్యే ఇళ్లలో వీటిని పరిగణించరని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

తూర్పులో ఇలా..

తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు' పథకంలో 431 లేఅవుట్లలో 65,075 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో 47,053 ఇళ్లు, ప్రైవేటు స్థలాల్లో 18,022 ఇళ్ల నిర్మాణాలకు నాంది పలికారు. గత ప్రభుత్వంలో యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నిరంతరాయంగా కొనసాగింది. సకాలంలో బిల్లులు రావడంతో లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టారు. ఇలా ఇప్పటి వరకు 25,316 గృహాలు అన్ని హంగులతో పూర్తయ్యాయి. గృహ ప్రవేశాలు సైతం పూర్తయ్యాయి. పునాది దశలో 6,654, లింటెల్ లెవెల్‌లో 2,019, రూఫ్ లెవెల్లో 1,379, ఆర్‌సీ లెవెల్లో 2,340 ఇళ్లు ఉన్నాయి. ప్రారంభం కానివి ఇంకా 25 వేలకు వరకు ఉన్నాయి. వీటి పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వం స్థలాలిచ్చి ఇళ్లు మంజూరు చేసింది. మార్చి వరకు పూర్తికాకపోతే నిధులు మంజూరు కావని ప్రభుత్వం చెబుతోంది. ఇంకా ప్రారంభించని వారి పరిస్థితేంటన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

డిసెంబర్ నెలాఖరుకు లక్ష్యాలిలా..

నియోజకవర్గం	గృహ నిర్మాణ లక్ష్యం	సాధించింది	పెండింగ్
నిడదవోలు	355	56	299
గోకవరం	75	10	65
అనపర్తి	308	39	269
రాజానగరం	365	44	321
గోపాలపురం	887	87	800
కొవ్వూరు	510	48	462
రాజమహేంద్రవరం రూరల్	182	13	169
రాజమహేంద్రవరం అర్బన్	2,193	34	2,159

ఇంజినీరింగ్ అధికారులే కీలకం

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలంటే ఇంజినీరింగ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం. ఇందులో భాగంగానే గత ప్రభుత్వం వారికి అత్యంత ప్రాధాన్యం కల్పించింది. లేఅవుట్లలో పర్యటించడం, లబ్ధిదారులతో పనుల పర్యవేక్షణ, బిల్లుల చెల్లింపునకు వెబ్‌సైట్‌లో గృహాల పురోగతి నమోదు చేయడం వీరి ఆధ్వర్యంలో నడుస్తుంది. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో కృషి చేస్తే కానీ ప్రభుత్వం అనుకున్న లక్ష్యం సాకారం అవ్వదు. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న సమయంలో ప్రభుత్వం మొక్కుబడి సమావేశాలకు అధికారులను వినియోగించడంపై లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పంట సాగుపై నైపుణ్యం పెంచుకోవాలి



వ్యవసాయ పంచాంగాలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఉద్యోగి పంట సాగుపై నైపుణ్యం పెంచుకోవాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. హుకుంపేట గ్రామంలో సోమవారం గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యానవన సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పంటకు కావలసిన ముఖ్యమైన పోషకాలను ఆయన క్లుప్తంగా వివరించారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ సీహెచ్ నరసింహారావు మాట్లాడుతూ, వరిలో సమగ్ర సస్యరక్షణ, విత్తనం ఎంపిక చేసుకునే విధివిధానాలు, సామూహిక ఎలుకల నివారణను తెలిపారు. శాస్త్రవేత్త ఎం.శ్రీనివాస్ ఎరువులు, నీటి, కలుపు మందుల యాజమాన్యాన్ని వివరించారు. రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంటలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరించడంతో కలిగే లాభాలను విశదీకరించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు రామలక్ష్మి మాట్లాడుతూ, వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉచితంగా వ్యవసాయ పంచాంగాలను జిల్లా వ్యవసాయాధికారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సబ్ డివిజన్ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- మంత్రి కందుల దుర్గేష్
- ఏపీ అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభం



క్రీడా జ్యోతిని వెలిగించి, పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాజానగరం: క్రీడల ద్వారా శరీరదారుఢ్యంతో పాటు, మానసిక, వ్యక్తిత్వ వికాసం కలుగుతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తిని చూపించి, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యా నికేతన్‌లో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల హ్యాండ్ బాల్ టోర్నమెంట్స్–2024ని సోమవారం మంత్రి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. హ్యాండ్‌బాల్ అద్భుతమైన ఆట అని, ఈ ప్రాంతంలో అంతగా ప్రాచుర్యం లేకపోయినా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి, అందరికీ తెలిసేలా చేయడం హర్షణీయమన్నారు. ఒలింపిక్‌లో కూడా ఈ గేమ్ ఉన్నందున క్రీడాకారులు ఆ దిశగా తమ ప్రతిభను కనబరిచేలా కృషి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన ప్రోత్సాహం ప్రభుత్వపరంగా లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చియ్యచౌదరి, విద్యా సంస్థ కరస్పాండెంట్ విజయ్‌ప్రకాష్, ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఏపీకి తెలుగు సినీపరిశ్రమ

తెలుగు సినీ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. దివాన్‌చెరువులో ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో షూటింగ్‌లు బాగా జరుగుతున్నాయని, ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. అయితే అందుకు మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వీటి ఏర్పాటుకు ఇప్పటికే నిర్మాతలకు లేఖ రాశామన్నారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు భేటీ కావాలన్న ఆహ్వానాన్ని వారు అంగీకరించారన్నారు. ఇదే సమయంలో నంది అవార్డుల విషయాన్ని కూడా చర్చిస్తామన్నారు.

మద్యం షాపులకు 1,057 దరఖాస్తులు

ఒక్క రోజులోనే 632 దరఖాస్తులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో 125 షాపులకు గాను సోమవారం రాత్రి 8 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 1.057 దరఖాస్తులు వచ్చాయని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య తెలిపారు. సోమవారం ఒక్కరోజే 632 దరఖాస్తులు అందాయని చెప్పారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి మరో రెండు రోజులే గడువు ఉండడంతో, మద్యం షాపుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రశాంతంగా టెట్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా జరిగిందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. రాజమహేంద్రవరం పేపర్ మిల్ సమీపంలో ఉన్న రాజీవ్ గాంధీ విద్యా సంస్థలోని ఇయాన్ డిజిటల్ జోన్‌లో ఉదయం సెషన్‌లో 240 మంది పరీక్షలు రాయల్సి ఉండగా, 220 హాజరయ్యారని చెప్పారు. 20 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన సెషన్–2 పరీక్షకు 240 మందికి 210 మంది హాజరయ్యారని, 30 మంది గైర్హాజరయ్యారని చెప్పారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు కోలా సత్యనారాయణ, గణపతి వ్యవహరిస్తున్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: శరన్నవరాత్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా మీదుగా మంగళవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ ప్రకటించింది. రైల్వే అధికారులు సోమవారం ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడ–సికింద్రాబాద్ (07071) ఈ నెల 8, 10, 12 తేదీలలో, అదేవిధంగా సికింద్రాబాద్–కాకినాడ(07072) 9, 11 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. ఈ రైళ్లు జిల్లాలోని సామర్లకోట, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా పౌర సరఫరాల శాఖాధికారిగా ప్రసాద్



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి(డీఎస్‌వో)గా కేవీఎస్ఎం ప్రసాద్ సోమవారం డీఎస్‌వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లా డీఎస్‌వోగా పనిచేస్తూ, బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ రాధిక ఇన్‌చార్జి డీఎస్‌వోగా వ్యవహరించారు. డీఎస్‌వో బాధ్యతలు స్వీకరించిన కేవీఎస్ఎం ప్రసాద్ కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలుపై దృష్టి సారిస్తామని చెప్పారు.

అమ్మనామమే శక్తివంతం

- అమ్మవారికే లలిత రహస్య సహస్ర నామాలు
- మహాశక్తి యాగంలో పరిపూర్ణనంద స్వామి
- గాయత్రీ మాతగా ఐశ్వర్యాంబిక అమ్మవారి దర్శనం



కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగంలో భాగంగా లలితా అమ్మవారికి హారతి ఇస్తున్న పరపూర్ణనంద స్వామి

కాకినాడ రూరల్: హిందూ సనాతన ధర్మంలో ఒకొక్క దైవానికి స్తోత్రం ఉందని, ఒక్క అమ్మవారికి మాత్రమే లలితా రహస్య సహస్రం అంకె ఉందని పరిపూర్ణనంద స్వామి అన్నారు. స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఐదో రోజు సోమవారం ఉదయం లలితా కుంకుమార్చనలకు ముందు భక్తులను ఉద్దేశించి పరిపూర్ణనంద స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. మిలిగిన స్తోత్రాలు దైవం శక్తిని తెలుపుతాయని, లలిత రహస్య సహస్ర నామంలో మనల్ని శక్తివంతులుగా మార్చి, అమ్మవారు మనల్ని కలుపుకొంటుందన్నారు. ఆ స్థాయిని అందుకోకపోతే, ఆ స్థితిని అర్థం చేసుకోకపోతే మనం చేస్తున్న పూజ, పారాయణం ఒక క్రియ మాత్రమే అవుతుందన్నారు. నిష్కల్మషమైన హృదయం, నిస్వార్థమైన భావంతో అమ్మ వారికి అన్నీ సమర్పించాలని పరిపూర్ణనంద స్వామి కోరారు. మహాశక్తి యాగంలో భాగంగా ఐదో రోజు విశేష పూజల్లో భాగంగా గృహ దోష పరిహారం కోసం లక్ష నారికేళ పూజ, గాయత్రీ, సౌర హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం వరకు వారాహి మాతగా భక్తులకు దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబిక అమ్మవారు సాయంత్రం నుంచి గాయత్రీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమ పూజల్లో సుమారు 30 వేలకు పైగా భక్తులు హాజరయ్యారని పరిపూర్ణనంద స్వామి తెలిపారు.



రమణయ్యపేటలోని శ్రీపీఠంలో గాయత్రీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన ఐశ్వర్యాంబిక అమ్మవారు

లోకమాతా పాహిమాం



శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పాస్తా, వడియాలతో అమ్మవారు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): జిల్లాలో శరన్నవరాత్ర మహోత్సవాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఐదో రోజు రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లోని అమ్మవారిని శ్రీబాలాత్రిపుర సుందరి దేవి అవతారంలో దర్శించుకుని భక్తులు తరించారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల నుంచే కాకుండా, ఇతర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అమ్మవారితో పాటు, దేవీచౌక్ నాలుగు కూడళ్లలో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగులను తిలకించేందుకు ఎగబడుతున్నారు. కాగా శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పాస్తా, వడియాలతో అమ్మవారిని అలంకరించారు. గోదావరి గట్టున ఉన్న శ్రీఉమామార్కండేయేశ్వర స్వామివారి ఆలయంలో స్వయంభూగా వెలసిన పార్వతీ మాతను అన్నపూర్ణా దేవిగా అలంకరించారు.

క్లుప్తంగా

డీజిల్‌తో రెండు వాహనాల సీజ్

తాళ్లరేవు: యానాం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఏటిగట్టు రహదారిలో తరలిస్తున్న 5,400 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పోలీసు, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా దాడులు నిర్వహించగా, యానాం నుంచి ద్రాక్షారామకు 3 వేల లీటర్ల డీజిల్‌తో వెళుతున్న బొలేరో వాహనాన్ని గోవలంక కనకదుర్గమ్మ ఆలయం వద్ద పట్టుకున్నామన్నారు. అదేవిధంగా అరటికాయలంక వద్ద నిర్వహించిన తనిఖీల్లో యానాం నుంచి రావులపాలేనికి బొలెరో వాహనంలో తరలిస్తున్న 2,400 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని డీజిల్‌తోపాటు వాహనాలను సీజ్ చేశామన్నారు. అక్రమ తరలింపుదారులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డీజిల్‌ను తదుపరి చర్యల నిమిత్తం పౌరసరఫరాల శాఖకు అప్పగించామని అన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

అంబాజీపేట: ఓ యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అంబాజీపేట పోలీసులు తెలిపారు. కె.పెదపూడికి చెందిన యువతి (20) ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె తాతయ్య కుడుపూడి నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. చుట్టుపక్కల, బంధువులు ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సూర్యనారాయణ వివరించారు.

బంగారు ఆభరణాల చోరీ

తుని: ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళ మెడలోని నుంచి బంగారు ఆభరణాలను ఇద్దరు యువకులు లాక్కొని పరారయ్యారు. ఆ వివరాల్లోకెళితే.. తుని మండలం వెలమ కొత్తూరుకు చెందిన వివాహిత కర్రి లక్ష్మి దుస్తులు కొనుగోలు చేసేందుకు తుని వచ్చింది. తునిలో వాణీ ఫ్యాన్సీ స్టోర్ వీధిలో నడిచి వెళ్తుంటుండగా ఒక యువకుడు నడుచుకుంటూ, మరో యువకుడు మోటారు సైకిల్‌పై వచ్చారు. నడుచుకుంటూ వచ్చిన యువకుడు కర్రి లక్ష్మి దగ్గరకు వచ్చి మెడలో ఉన్న బంగారు తాడు, బంగారు నల్లపూసల తాడును లాక్కొని బైక్‌పై పరారయ్యారు. అపహరణకు గురైన ఆభరణాలు నాలుగు కాసులు ఉంటాయని కర్రి లక్ష్మి పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు.

వ్యాన్ బోల్తా: 27 గొర్రెల మృతి

దేవరపల్లి: గుంటూరు నుంచి విశాఖపట్నానికి గొర్రెలను రవాణా చేస్తున్న వ్యాన్ గుండుగొలను– కొవ్వూరు జాతీయ రహదారిపై దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద సోమవారం రాత్రి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లోని 27 గొర్రెలు మృతి చెందగా, అందులోని నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మూషికాలతో ముప్పు

- పిలక దశలో వరి పైరు
- పంటలను దెబ్బతీస్తున్న ఎలుకలు
- ఏటా ఖరీఫ్‌లో తీవ్ర నష్టం


ఎలుక కొట్టుడుకు గురవుతున్న వరి పొలం


ఎలుకల నివారణకు సిద్ధం చేసిన బుట్టలు

కాకినాడ సిటీ: మూషికాలు అన్నదాతను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంటున్న తరుణంలో తీపిగా ఉండే దుబ్బు, పిలకలను మూషికాలు తినేస్తూ దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. మూషికాల బారి నుంచి వరి పైరును ఎలా సంరక్షించుకోవాలో వ్యవసాయ అధికారి విజయకుమార్ వివరించారు. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 93 వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ఇందులో ప్రధానంగా స్వర్ణ, సాంబమసూరి రకాలకు చెందిన వరి పంటను మాత్రమే వేశారు. వర్షాభావ పరిస్థితి కారణంగా ఆగస్టు చివరి నాటికి ఊడ్పులు పూర్తి చేశారు. చాలాచోట్ల వెదజల్లు పద్ధతి అవలంబించడంతో అవి వేగంగా పెరిగి దుబ్బు కట్టే దశకు చేరుకున్నాయి. పిలకలు పొట్ట తీపిగా ఉండడంతో ఎలుకలు వాటిని కొరికి బొరియల్లోకి తీసుకెళ్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో ఎలుకలను నివారించే వ్యవస్థ లేకపోవడంతో రైతులకు ఏటా నష్టాలు తప్పడం లేదు. ఎలుకలను సామూహికంగా నివారించేందుకు ప్రభుత్వం ఎలుకలు పట్టే బుట్టలు గాని, బ్రోమోడయోలిన్ మందును గానీ వ్యవసాయ శాఖ పంపిణీ చేయాలి. నేటికీ జిల్లాలో ఎలాంటి చర్యలూ చేపట్ట లేదు.

నివారణకు ఏం చేయాలంటే..

- గ్రామంలోని రైతులంతా కలసి ఓ యూనిట్‌గా ఏర్పడి సామూహిక ఎలుకల నివారణకు చర్యలు చేపట్టాలి.
- సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయాలిన్ రెండు శాతం మందును ఉపయోగించి సత్ఫలితాలను పొందవచ్చు.
- బ్రోమోడయాలిన్ 0.25 మిల్లీలీటర్ల ఎలుకల మందు రెండు శాతం విషపు ఎరగా తయారీ చేసుకోవడం కోసం 96 పాళ్ల నూకలు, రెండు గ్రాముల నూనె, రెండు గ్రాముల బ్రోమోడయోలిన్ మందును కలిపాలి.
- విషపు ఎర తయారు చేసే సమయంలో చేతులకు గ్లౌజులు లేదా పాలిథిన్ సంచి తొడుక్కోవాలి. లేదంటే మందులో ఉండే మనిషి చేతి వాసనను ఎలుక పసిగట్టి ఎరను స్వీకరించదు.
- ఒక్కో సజీవ ఎలుక బొరియకు 10 గ్రాముల ఎరను కాగితంలో పొట్లంగా చుట్టి ఎలుక బొరియల్లో అంగుళం లోపల పెట్టాలి. పొట్లాలు అమర్చిన అనంతరం బొరియను మూసి వేయకూడదు.
- భారీ, మోస్తరు వర్షం గానీ వస్తే వర్షం ఆగే వరకూ చూడాలి. లేదంటే మరుసటి రోజుకు వాయిదా వేయాలి. ఎర మందు వర్షంలో తడిస్తే సరిగా పని చేయదు.
- కలిపిన ఎర మందు 12 గంటలు దాటితే ఆ వాసనను ఎలుకలు పసిగడతాయి. కాబట్టి ఈ విశ్రమాన్ని మధ్యాహ్నం కలిపి సాయంత్రం లోపు అమర్చాలి. ఎలుకలు నిశాచరులు కాబట్టి సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ స్వీకరించే అవకాశం ఉంది.
- మందు తిన్న నాలుగు నుంచి ఐదు రోజులకు ఎలుక చనిపోతుంది. ఈ మందు తిన్న ఎలుకల రక్తం గడ్డ కట్టదు. అవి రక్తస్రావమై రక్తహీనతతో చనిపోతాయి. అందువల్ల ఎలుకల బొరియల సంఖ్య నమోదు చేయాలంటే మందు అమర్చిన 7 నుంచి 10 రోజుల తరువాత చేయాలి.

పొగ పెట్టాలి

పొగబారించే యంత్రం (బర్రోఫ్యూమి గేటర్)తో ఎలుక బొరియలను కప్పి రెండు నుంచి మూడు నిమిషాలు పొగ పెడితే వాటిలో ఉంటే తల్లి, పిల్ల ఎలుకలు పూర్తిగా చనిపోతాయి. తొలకరి చినుకుల అనంతరం పంట భూమిని దుక్కి చేయాలి. రైతులు పొలం గట్లపై కాకుండా పోరంబోకు భూములు, ఖాళీ ప్రదేశాల్లో విషపు ఎరను పెట్టి ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలి. ఎలుక బొరియలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పొగ పెట్టడం మంచిది.

ఎన్నో పద్ధతులు ఉన్నాయి..



మూషికాలతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతోంది. రాష్ట్రంలో ఏటా 50 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను అన్నదాతలు నష్టపోతున్నారు. రైతులు దీనిపై దృష్టి సారించి సామూహికంగా ఎలుకలను నిర్మూలించేందుకు ముందుకు రావాలి. ఇందుకు ఎన్నో పద్ధతులు ఉన్నాయి. విషపు ఎరలు పెట్టడంతో పాటు ట్రాప్‌లు, పొగబారించే పద్ధతులు అవలంబించాలి.

– ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

రైతులు దృష్టి పెట్టాలి



రైతులు యాజమాన్య పద్ధతుల్లో భాగంగా ఎలుకలను నివారించుకోవాలి. వరి దుబ్బులు తీపిగా ఉండడంతో పొట్ట దశలోనే ఎలుకలు వీటిని కొరికి రైతులకు నష్టం కలిగిస్తాయి. బొరియలను గుర్తించి అందులో విషపు ఎరలు, ట్రాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎలుకల బుట్టలను సైతం ఉంచితే అవి చిక్కి పొలాల్లోకి వెళ్లవు. ఇది రైతులంతా సామూహికంగా చేపట్టాలి.

–ఏపీ రాజేష్, కరప మండల వ్యవసాయ అధికారి

వ్యక్తి మృతదేహం లభ్యం

కాకినాడ క్రైం: స్థానిక కొండయ్యపాలెం కొత్త వంతెన కింద సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని టూ టౌన్ పోలీసులు తెలిపారు. సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం పాడైన స్థితిలో ఉందన్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించామన్నారు.

ఏఎన్‌ఎంకు తీవ్ర గాయాలు

ముమ్మిడివరం: స్కూటీపై విధులకు వెళ్తున్న ఏఎన్ఎంను వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో ఆమెతోపాటు ఓ బాలిక తీవ్రంగా గాయపడ్డారు. ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన ఏఎన్ఎం మొల్లి మంగాయమ్మ సోమవారం స్కూటీపై ఐదేళ్ల జాను అనే పాపతో కలసి కొమానపల్లి హెల్త్ సెంటర్‌కు వెళ్తుండగా పల్లిపాలెం సెంటర్‌లో వెనుక నుంచి ఆటో ఢీకొంది. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అహోరాత్ర పారాయణ

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని అహోరాత్ర పారాయణ మంగళవారం నిర్వహించనున్నారు. స్థానిక లలితా భక్త మండలి ఆధ్వర్యంలో ద్వితీయ అహోరాత్ర లలిత సహస్రనామ పారాయణ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున కలశ స్థాపనతో ప్రారంభమై మహిళలతో 24 గంటల పాటు లలితా పారాయణ జరుగుతుందన్నారు. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, భక్తులు అందరూ పాల్గొనాలని అన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి


పీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

రాజమహేంద్రవరం రూరల్: ఈపీఎఫ్–95 పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు ఇవ్వాలని ఏపీ రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సోమేశ్వరరావు, సీహెచ్ మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఏపీ రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు జిల్లాల సభ్యులు ధర్నా చేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సోమేశ్వరరావు, మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీఆర్‌పీఏ రాష్ట్ర నాయకుడు కె.సత్తిరాజు, సీఐటీయూ తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్ని సార్లు అడిగినా పెన్షన్ పెంచడం లేదన్నారు. చాలీచాలని పెన్షన్‌తో వృద్ధాప్యంలో బతకడం చాలా కష్టమని, పెరుగుతున్న ధరలకు ఈ పెన్షన్‌కు పొంతనే లేదని అన్నారు. వీటన్నింటికీ కేంద్ర ప్రభుత్వ వైఖరి కారణమన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి చనిపోయిన పెన్షనర్ల కుటుంబానికి నష్ట పరిహారం ఇవ్వాలని, లేదంటే భవిష్యత్‌లో తమ పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కనీస డీఏ ఇవ్వాలని, హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ పునరుద్ధరించాలని, భార్యాభర్తల ఇద్దరికీ వైద్య సదుపాయం కల్పించాలని తదితర కోరారు. అనంతరం పీఎఫ్ రీజినల్ కమిషనర్ మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో సీఐటీయూ నాయకులు కేఎస్‌వీ రామచంద్రరావు, బి.పూర్ణిమ రాజు, అజయ్ కుమార్, రామదాసు, కృష్ణారావు, ప్రభాకర్, వివిధ జిల్లాల పెన్షనర్లు పాల్గొన్నారు.

అమ్మ ఆశీస్సులు ఉంటే అన్నీ శుభాలే

- రజత కవచాలంకృత అవతారంలో విజయదుర్గమ్మ
- భక్తులతో కిటకిటలాడిన విజయదుర్గా పీఠం


పీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం: అమ్మ ఆశీస్సులుంటే అన్నీ శుభాలే కలుగుతాయని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) భక్తులకు ఉద్బోధించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం గాడ్ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మంచి కార్యక్రమానికి దైవ ఆశీస్సులు ఎల్లప్పుడూ తోడుగా ఉంటాయన్నారు. ఆధ్యాత్మికవేత్తలు తాతా సందీప్‌శర్మ, శతావధాని శరత్‌చంద్రలు ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ భగవంతుడికి భక్తులకు గురువులు అనుసంధానకర్తలుగా ఉంటారన్నారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారి అవతారాలు, అమ్మవారి ఏఏ అవతారాల్లో రాక్షస సంహారం ఏ విధంగా జరిగిందనే విషయాన్ని భక్తులకు వివరించారు. విజయదుర్గా అమ్మవారు రజత కవచ అలంకృత అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠ బ్రహ్మ శివ, అర్చకులు చీమలకొండ వీరావధాని, తోలేటి నాగేంద్రశర్మ, చక్రవర్తుల మాధవాచార్యుల అర్చకత్వంలో విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ఏకవార రుద్రాభిషేకం, గాయత్రి అష్టోత్తరంతో కుంకుమ పూజలు, నవగ్రహ హోమం జరిపారు. పీఠంలో భక్తులు కలశాలు ఏర్పాటు చేసుకుని సామూహిక కుంకుమ పూజలు చేశారు. భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, పెదపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ తదితరుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు దంపతులు పీఠంలో పూజలు చేసి, పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. మండలంలోని రాయవరం, వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, లొల్ల, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయం, సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.


అన్నపూర్ణాదేవి అవతారంలో విజయదుర్గమ్మ

అండర్-14 క్రికెట్ జట్టుకు లక్ష్మీనారాయణ ఎంపిక


జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన లక్ష్మీనారాయణ

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్–14 క్రికెట్ జట్టుకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సీహెచ్ లక్ష్మీనారాయణ ఎంపికైనట్లు హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి కడప జిల్లాలో జరిగే క్రికెట్ పోటీల్లో పాల్గొనున్నాడన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు గుంటూరు, విజయనగరం, శ్రీకాకుళం, కృష్ణా, ఒంగోలు, అనంతపురం జిల్లా జట్లతో తలపడనుందన్నారు. అత్యంత ప్రతిభ కనబర్చిన లక్ష్మీనారాయణ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడన్నారు. లక్ష్మీనారాయణ ఎంపికపై హెచ్ఎం, పీడీలతో పాటు పీఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, క్రికెట్ కోచ్ ఎం.సత్తిబాబు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు పతకం


అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో బంగారు పతకం సాధించిన వెంకటహర్ష-నితిన్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ నిర్వహించిన ఉగాండా ఇంటర్నేషనల్ సీరిస్–24 బ్యాడ్మింటన్ పోటీల్లో కాకినాడ జిల్లాకు చెందిన వెంకట హర్షరాయుడు ప్రతిభ చాటారు. పురుషుల డబుల్స్ విభాగంలో పోటీపడిన వెంకటహర్ష రాయుడు– నితిన్ జట్టు బంగారు పతకం సాధించింది. హైదరాబాద్‌లోని పుల్లెలగోపీచంద్ అకాడమీలో ఐదేళ్లుగా బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్నారు. హర్ష అచ్చంపేట గ్రామానికి చెందిన వీరంరెడ్డి వసంత రాయుడు ద్వితీయ కుమారుడు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించిన అతన్ని డీఎస్ఏ బ్యాడ్మింటన్ కోచ్ చిన్నారి అభినందించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు


తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్

నల్లజర్ల: నల్లజర్లకు చెందిన క్లెం దుర్గాప్రసాద్ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను ఏలూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఘంటావారిగూడెం హైవేపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతల వైపు రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతన్ని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరు సొసైటీలో చోరీకి పాల్పడిన నిందితుడు గుబిల సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.5 వేల నగదు రికవరీ చేశామన్నారు. నిందితుడు ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెద్ద గొన్నూరు గ్రామానికి చెందిన వాడన్నారు. నేరం జరిగిన 24 గంటల వ్యవధిలోనే చోరీ కేసును పోలీసులు ఛేదించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదాలు


ఎస్.రామేశ్వరంలో అదుపు తప్పి బోల్తా పడిన ఆటో

అల్లవరం: అల్లవరంలో రొయ్యల వేట ముగించుకుని కూలీలతో వెళ్తున్న ఆటో ఎస్.రామేశ్వరం తూము వద్ద సోమవారం సాయంత్రం ప్రమాదానికి గురైంది. ఆటోకి ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించబోయి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కనే బోదెలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి వేగంగా, దురుసుగా ఆటోకి ఎదురుగా రావడంతో ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు.

బెండపూడి వద్ద..

తొండంగి: జాతీయ రహదారిపై బెండపూడి వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న లారీ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి కారును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ వేగాన్ని గమనించిన కారు డ్రైవర్ కారును చాకచక్యంగా తప్పించడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలతో గౌరవంగా మెలగాలి


ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్య కిషోర్

డీఎస్పీ భవ్యకిషోర్

ధవళేశ్వరం: పోలీస్ స్టేషన్‌కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో మర్యాదగా మెలగాలని ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బందికి రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ సూచించారు. సోమవారం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలు పురోగతిపై చర్చించారు. నేరాల అదుపునకు ప్రజల భాగస్వామ్యంతో కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కదలికలపై ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఉండేలా దృష్టి సారించాలన్నారు. ప్రతి ముగ్గురు రౌడీ షీటర్లకు ఒక కానిస్టేబుల్ చొప్పున కేటాయించి వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. నేరాల అదుపునకు సమష్టి కృషి అవసరమని సూచించారు. వివిధ కేసుల వివరాలను సీఐ టి.గణేష్ వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి (65) సోమవారం మృతి చెందాడని బొమ్మూరు ఎస్సై ఎస్.ప్రియాకుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 28న రాత్రి లాలాచెరువు హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద భిక్షాటన చేస్తున్న వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీనిపై దివాన్‌చెరువు వీఆర్ఓ దారా రామజోగి ఫిర్యాదు చేశారు.

పశువుల స్వాధీనం

కొవ్వూరు: తుని నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువుల లారీని పట్టణ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ లారీలోని 29 ఎద్దులను స్వాధీనం చేసుకుని గోకవరంలోని గోశాలకు అప్పగించినట్లు పట్టణ ఎస్సై కె.జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

టెండర్ల ప్రకటనపై గందరగోళం

యానాం: యానాం ఫలపుష్ప ప్రదర్శన–2025ను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ వివిధ రకాల మొక్కలు సరఫరా చేయాలంటూ చేసిన బహిరంగ ప్రకటన గందరగోళానికి గురిచేయడంతో తాము టెండర్లు వేయలేకపోయామని సోమవారం పలు నర్సరీల యాజమాన్యాలు విలేకరులకు తెలిపారు. గత నెల 25న డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ డైరెక్టర్ పేర కొటేషన్ నోటీసును జారీ చేశారు. ఇందులో ఫారెస్టరీ, నర్సరీ మొక్కలు కావాలని అక్టోబర్ 9లోగా టెండర్లు వేయాలని, అదే ఆఖరు తేదీ అని పేర్కొని వివిధ నర్సరీలకు పంపించారు. అయితే మళ్లీ టెండర్ల తేదీకి ఆఖరు తేదీ అక్టోబర్ 7 అని పేర్కొని మార్చిన తేదీని తమకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచారని, దీంతో తామంతా సమయం 9వ తేదీ వరకూ ఉందని భావించి టెండర్లు వేయ లేకపోయామని కడియపులంక గోపిసాయిరామ్ నర్సరీ యజమాని ఈలి గోపాలరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే వ్యవసాయ శాఖ సిబ్బంది మార్చిన తేదీని గోప్యంగా ఉంచారని, ఆ విధంగా తమకు కావాల్సిన వారికి మాత్రమే తెలియజేసి వారితోనే కొటేషన్లు వేయించారని ఆరోపించారు. ఈ ఘటనపై ఆర్ఏఓ మునిస్వామికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.